# మారిన మస్తాన్ ★

రచన:
శ్రీ తుమ్మల దాదా రెడ్డి.

అస్తమానమూ అవస్థతో కుస్తీపడుతూ, ఈ వ్యవస్థలో తన బ్రతుకు గడిపేందుకు నానా యాతన పడే గుమాస్తా మన మస్తాన్. రెండు చేతులా సంపాదించే చేర్ ప్రక్కన మిట మిట చూస్తూ గడపడం గండంగానే ఉంది. ఆ మహాత్మునికి అండగా నిలిస్తే పావులో పరకో ఇవ్వడా అన్న ఆలోచనను ఆత్మాభిమానం అదిమిపట్టింది. కోరికలు కోడెనాగుల్లా బుసలు కొట్టినా పరిస్థితిమాత్రం పడగెత్తనీయలేదు. అహర్నిశలూ శ్రమించినా ఎక్కడేసిన గొంగడి అక్కడే మూల్గడంవల్ల బ్రతుకుపై ఆశ ఉడిగిపోసాగింది. తోటిసుఖపడేవారిపై అక్కసు జనించింది.

ముద్దుముచ్చటా తీరకముందే ఒక్కసారే ఇద్దర్నికన్న రజియా గుండెలమీది కుంపటికాగానే అనుకున్నాడు తన బ్రతుకు ముక్కలు చింపిన విస్తరి అయ్యిందని. వైవాహిక జీవితాన్ని స్వర్గతుల్యమనేవారు వెధవల్లా కనిపించారు, సన్యాసులే ఎంతో సంతోషంగా బ్రతుకుతున్నారని సంసారి మస్తాన్ విచారించేవాడు.

సర్దుకుపోయే తత్వాన్ని అలవర్చుకోక, ఆ ఔన్నత్యం లేక అనుక్షణం నరకయాతనకు గురయ్యేవాడు. మస్తాన్ స్మృతి పథంలో ఊసరవెల్లి బ్రతుకులు గడిపేవారు మెదులుతారు, తనూ వారిలా మారితే అని ఆలోచించిన క్షణాలు ఎన్నో ఉన్నాయ్. డిస్టిల్ వాటర్ ఇచ్చి పచ్చనోట్లు లాగే డాక్టర్లూ, బూడిదను సిమెంటు చేసే కంట్రాక్టర్లూ, రోజూ రాజులా ఖర్చుపెడుతూ తిరిగే కండక్టర్లూ వీరంతా సంపాదిస్తున్నారు. వీరికంటే నాకు తెలివి తక్కువనా? అని తలమునకలయ్యేట్టు యోచించి తల నొప్పితో నిద్రరాక జాగరణ చేసిన రోజులు మస్తాన్ జీవితంలో మస్తుగా ఉన్నాయ్.

తనకీ లోకంలో శాంతి లేదని మరోలోకం పోవాలని, మరోలోకానికి దారి "సారా" యేనని తెలుసుకొని ఆ దారినే అనుసరించాడు, ఎర్రబడిన కనులలో తూలుతూ ఇల్లు చేరే మస్తాన్ ను చూసి పుస్తె కట్టించుకొన్న రజియా మనసు కుతకుతలాడినా నిగ్రహించుకొని ఇన్ని మెతుకులు తినిపించి కవలపిల్లలు గుక్కత్రిప్పకోకుండా ఏడుస్తున్నా మగన్ని ప్రక్కమీదికి చేర్చి ఓర్పువహించేది ఆ నాలుగు క్షణాలు. మనిషిని నాశనం చేసేది ఆశ అనిపిస్తుంది. మస్తాన్ వైఖరి చూస్తుంటే, అందని దాన్నందుకునే యత్నంలో అందినదాన్ని అనుభవించలేని అసమర్థుల్లో కలుస్తాడు. తనకన్న చిన్నవాన్ని చూసుకుని తృప్తిపడే ఔన్నత్యం లేకనే అస్తమానమూ ఆలోచిస్తాడు. ఆలోచనల్లో ఆవగింజలో అరవయ్యోవంతైనా అవసరమున్నది ఉంటుందేమో!

ఎదురింటి మేడమీద జంట మూడేళ్ళనుండీ ఎన్నోతంటాలు పడుతున్నా సంతాన ప్రాప్తి లేదు. నాకేమో ఏడాది తిరక్కముందే ఇద్దరు పిల్లలు. వాడికి తిన్నేందుకు ఎవరూ లేరు, నాకు తినేందుకు లేదు. వాడిది రెండు చేతులా సంపాదించే ఉద్యోగం. నాకొచ్చే మూడు వందలపై ఎన్ని సర్దుబాట్లు చేయగలుగుతాను అని చాలా సార్లు బాధపడ్డాడు.

అర్ధరాత్రి ఊరంతా సద్దుమణిగిన వేళ. ఆలు


మగలు అన్నీ మరచి ఆప్యాయంగా గడిపేవేళ. మస్తాన్‌తో రజియా గుసగుస చెప్పింది నాకు నెల తప్పిందని. మస్తాన్ విస్తుపోయాడు చలి పిడుగులాంటి వార్త విని. "అలానా" అని బలవంతంగా అనగలిగాడు ఆ సమయంలో రజియా మనసు నొప్పించడం ఇష్టంలేక. మగాడు సంభాళించుకోలేని ఆ క్షణాలే ఆడవారి పాలిటి అమృత ఘడియలేమో! ఈమారు అమ్మాయి పుడితే ఎంత బాగుండు అనుకొని ఊరుకోక పైకే అనేసింది. ఒలకబోసిన ప్రేమ ఏమయ్యిందో మస్తాన్ తీక్షణంగా మారిపోయాడు.

ఏమే నీకెందుకీ సంబరం ఏం చూసుకుని మురుస్తున్నావ్? పుట్టిన పోరగాండ్లకు అన్నం పెట్టేందుకే పడరానిపాట్లు పడుతున్నాం ఇంకా కూతురంటున్నావ్, అదెందుకే మన నరకం అదీ అనుభవించాలా! మూలిగే నక్కపై తాటి టెంకలు పడ్డట్టైంది. ఈ చిరుద్యోగి జీవితాన్ని ఎలా గడపాలా అని తికమకపాలై పోతుంటే నీవేమో కూతురు అని ముద్దుగా బుంగమూత్తో చెప్తున్నావ్. అవసరాలు పెరిగి ఆదాయం తరుగైనవాడు అక్రమ మార్గాలనుసరించి ఆవేదన పాలు కావలి. బ్రతికే బ్రతుకేదో గౌరవంగా బ్రతుకక బండెడు సంసారాన్ని చేసుకొని బలి అవడమెందుకు? ప్రభుత్వం ఈనాడు ఇద్దరు పిల్లలు చాలు అని ఏకధాటిగా చెప్తోంది. మనకు చాలదా ఈ ఇద్దరు పిల్లలు. కుక్కల్లా కనగానే సరిపోతుందా?

మస్తాన్ మాటలు విన్న రజియాకు మత్తు వదిలింది పేదతనం కనుల ముందు మెదలింది. అయితే ఇప్పుడేం చేద్దాం అంది.

రేపు డాక్టరు వద్దకు వెళ్ళి సంప్రదించుదాం అన్నాడు నిశ్చయంగా.

యింతలోనే అంతగా మారిపోయిన మస్తాన్ ప్రవర్తన చూసి రజియా అర్థంచేసుకొంది మొన్న ఆఫీసులో అక్రమ ప్రవర్తన క్రింద తన ప్రక్క కుర్చీలోని సార్‌ను సర్కారోళ్ళు అరెస్టు చేసిన నాటి నుండే ఈ పరివర్తన వచ్చిందని.




"అనసూయ"

అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన అంకుర్, నిశాంత్ మున్నగు హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించిన పద్మశ్రీ శ్యాంబెనెగల్ డైరెక్షన్‌లో—నిర్మాత శ్రీ కె. వెంకట్రామరెడ్డిగారు రవిరాజ్ ఇంటర్నేషనల్ పతాకంక్రింద తెలుగు, హిందీ భాషలలో ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన సరికొత్త సాంఘిక చిత్రానికి "అనసూయ" అనే నామకరణాన్ని నిర్ణయంచేయటం జరిగింది.

భర్త శ్రేయస్సుకోసం పాటుబడిన ఒక ఆదర్శ గృహిణి వాస్తవగాధ ఆధారంతో నిర్మింపబడిన ఈ సాంఘిక చిత్రంలో వాణిశ్రీ కథానాయకి అనసూయ పాత్రలో లీనమై ప్రతిభావంతముగా నటించింది. స్మితాపాటిల్, సులభదేశ్‌పాండే, నిర్మల, రావు గోపాలరావు, అనంతనాగ్, వేణు, మరెందరో పాత—క్రొత్త నటీనటులందరూకూడా ఈ చిత్రంలో నటించారు. ప్రకృతి సౌందర్యం విరాజిల్లే విశాఖపట్నం పరిసర ప్రాంతాలలో అనుకున్న షెడ్యూలు ప్రకారం 52 రోజులలో షూటింగ్ జరిపి చిత్ర నిర్మాణాన్ని పూర్తిచేయుటం జరిగింది. అవుట్‌డోర్‌లో జరిగిన